క్లుప్తంగా

మహిళా న్యాయవాదికి సన్మానం


సన్మానిస్తున్న జడ్జి ముఖేష్, న్యాయవాదులు

బెల్లంపల్లి: న్యాయవాదుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రాణించిన బెల్లంపల్లికి చెందిన మహిళా న్యాయవాది నల్లుల సంగీతను గురువారం బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సివిల్ జడ్జి జె.ముఖేష్, బార్ అసోసియేషన్ నిర్వాహకులు శాలువా కప్పి సత్కరించారు. ఈ నెల 1, 2 తేదీల్లో మహిళా న్యాయవాదుల మూడో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరగ్గా సంగీత పాల్గొని చెస్, పాటల పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిప్ప మనోహర్, సింగతి రాజేష్, ఏజీపీ చొప్పదండి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు రాము, కే.బాలకృష్ణ, రాజన్న , సాయికుమార్, సందీప్, జుబేర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కలెక్టర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలటౌన్: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జన్మదిన వేడుకలను పలు శాఖల జిల్లా అధికారులు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం కలెక్టర్‌కు వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో, కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినంను పురస్కరించుకొని పలు శాఖల అధికారులు పూలమొక్కలను కలెక్టర్‌కు అందించారు.

రేపు వేలాలలో వేలం

జైపూర్: మండలంలో వేలాల మల్లన్నస్వామి జాతర ప్రసిద్ధి. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు జాతర జరగనుంది. ఈ ఏర్పాట్లలో భాగంగా శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు వేలాల ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌రావు, ఎంపీవో శ్రీపతిబాపురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వాహనాల పార్కింగ్, కొబ్బరికాయల విక్రయం, బోల్‌పేలాలు, లడ్డూప్రసాదం విక్రయం కోసం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు దరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

మండల ప్రత్యేక అధికారిగా హరికృష్ణ


హరికృష్ణను సన్మానిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండల ప్రత్యేక అధికారిగా బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ నియమితులయ్యారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేందర్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని హరికృష్ణ తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన మండల ప్రత్యేక అధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ దుర్గాప్రసాద్ దండేపల్లి మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణకాంతచారి

మందమర్రిరూరల్: చెస్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని పాలచెట్టు ఏరియా శ్రీ పంచముఖి ఆలయ అర్చకులు కృష్ణకాంతచారి నియమించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ సిరాజ్ ఉర్ రహమాన్ గురువారం నియామకపత్రం అందించారు.

సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభం


అమ్మవార్లను తీసుకొస్తున్న నిర్వాహకులు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి గ్రామంలో కొలువైన సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా ప్రారంభించారు. అర్జునగుట్ట గ్రామం నుంచి సమ్మక్క అమ్మవారిని గురువారం రాపన్‌పల్లి గద్దెకు గ్రామస్తులు డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో తీసుకొచ్చారు.

సమయపాలన పాటించని అధికారులు..!


భీమారం ఎంపీడీవో కార్యాలయంలో విధులకు హాజరైన కంప్యూటర్ ఆపరేటర్

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొన్ని నెలలుగా సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉదయం 11.30 నిమిషాలకు 'సాక్షి' విజిట్ చేయగా కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగితా సిబ్బంది రాలేదని ప్రశ్నించగా, వస్తారు అని సమాధానం ఇచ్చారు. పనుల కోసం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్తే అధికారులు సమయానికి రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే గల భీమారంలోని ప్రభుత్వ కార్యాలయం పరిస్థితి ఇలా ఉంటే, మారుమూల మండలాల పరిస్థితి ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సిబ్బంది సమయపాలన గురించి ఎంపీడీవో మధుసూదన్‌ని ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. కలెక్టర్ చర్యలు తీసుకొని సమయపాలన అధికారులు పాటించేలా చూడాలని కోరుతున్నారు.

విధులు బహిష్కరించి నిరసన

లక్సెట్టిపేట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న నాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా హన్మకొండ బార్ అసోసియేషన్ సభ్యులు గంధం శివపై ట్రాఫిక్ పోలీసులు దాడిచేసినందుకు నిరసనగా విధులు బహిష్కరించినట్లు తెలిపారు. న్యాయవాదులపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, విధుల నుంచి సస్పెండ్ చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు

పత్తి కొనుగోలు చేయాలని ధర్నా


కిష్టంపేటలోని జిన్నింగ్ మిల్లు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

చెన్నూర్‌రూరల్: సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేపట్టాలని మండలంలోని కిష్టంపేట గ్రామంలోని వరలక్ష్మి జిన్నింగ్ మిల్లు ఎదుట మంచిర్యాల, చెన్నూర్ ప్రధాన రహదారిపై గురువారం ధర్నా చేపట్టారు. రెండు రోజులుగా పత్తి వాహనాలతో ఇక్కడే ఉంటున్నామని, సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అన్ని పత్తి మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేపట్టాలని సీపీవో ఆదేశాలు జారీ చేసినప్పటికీ, నిర్వాహకులు మాత్రం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి ధర్నా నిర్వహించారు. దీంతో మార్కెట్ కమిటీ కార్యదర్శి, సీపీవోలు అక్కడకు చేరుకొని పత్తి కొనుగోళ్లు చేస్తామని సర్దిచెప్పడంతో రైతులు ధర్నా విరమించారు. చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లోని రైతుల పత్తిని మాత్రమే అనుమతించనున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు.


చెత్త డంప్ చేస్తున్న బెల్లంపల్లి మున్సిపల్ ట్రాక్టర్

ఇదేం చెత్త పని!

- బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్త కాసిపేటలో డంప్
- దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

కాసిపేట: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను కాల్‌టెక్స్, రైల్వేస్టేషన్, సోమగూడెం మీదుగా 10కిలోమీటర్ల దూరంలోని కాసిపేట మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ ఓపెన్‌కాస్ట్ క్యాంప్ ఆఫీస్ సమీపంలోని సింగరేణి స్థలంలో పోస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమగూడెం కాసిపేట ప్రధాన రహదారి పక్కనే పెద్దనపల్లికి వెళ్లే రోడ్డుకు కుడివైపునా బ్రిడ్జి సమీపంలో చెత్తను డంప్ చేయడం వివాదంగా మారుతోంది. రోజుకు పదుల సంఖ్యలో చెత్త వాహనాలు వందల సంఖ్యలో ట్రిప్పులు వేస్తున్నాయి. కేకే ఓసీలో కాంట్రాక్ట్ విధులు నిర్వర్తించే కార్మికుల క్యాంపు ఆఫీస్ చెత్త పోసే ప్రాంతానికి 200మీటర్ల దూరంలో ఉంది. సుమారు వంద మంది వరకు నివాసం ఉంటున్నారు. 20రోజుల నుంచి సాగుతున్న ఈ తంతులో మొదట చెత్త దుర్వాసన వస్తోందని, రోడ్ల మీద పడేసుకుంటూ వెళ్తున్నారని సోమగూడెం, దుబ్బగూడెం గ్రామస్తులు చెత్త తరలించే ట్రాక్టర్ డ్రైవర్లతో వాదనకు దిగడంతో చెత్త కింద పడకుండా వెనకాల పరదాలు కట్టి తరలిస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం స్థానికులు సోమగూడెం వద్ద ట్రాక్టర్లను అడ్డుకొని ఆందోళన నిర్వహించారు. పోలీసులు వచ్చి కలెక్టర్ ఆర్డర్ ఉందని మున్సిపల్ కమిషనర్ చెబుతున్నారు.. ఏమైనా ఉంటే కలెక్టర్‌కు విన్నవించుకోండని ఆందోళన విరమింపజేశారు. తాజాగా గురువారం పెద్దనపల్లి గ్రామపంచాయతీ సిబ్బంది చెత్త తరలింపును డంపింగ్‌యార్డు వద్ద అడ్డుకున్నారు. కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకొని ఆర్డర్ చూపాలని కోరగా బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ అనుమతి ఇచ్చినట్లు చెప్పడంతో ఎస్సై అక్కడి నుంచి వెనుతిరిగారు.

కిలోమీటర్ మేర దుర్వాసన..

వందల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలించిన చెత్తను గురువారం తగల బెట్టడంతో కిలోమీటర్ మేర దుర్వాసన వచ్చింది. తడి, పొడిచెత్తతో పాటు పలు మెడికల్ వ్యర్థాలు ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పక్కనే క్యాంపులో వంద మంది వరకు కాంట్రాక్టు కార్మికులు నివాసం ఉంటున్నారు. కొద్ది పాటి గాలివీచినా దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. ప్రధాన రోడ్డుకు సమీపంలో చెత్తను పోయడం, తగల బెట్టడం ఏంటని, ఎక్కడైనా దూరప్రాంతాలకు చెత్తను తరలించాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌ను వివరాలు అడగ్గా కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు చెత్త తరలింపు చేపట్టడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎటువంటి ఆర్డర్ రాలేదన్నారు.

బెల్లంపల్లి చెత్త ఇక్కడ పోయడం దారుణం

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని చెత్తను ఇక్కడ పోయడం దారుణం. చెత్త దుర్వాసనతో పాటు తగలబెడుతుండడంతో పొగతో నానా అవస్థలు పడుతున్నాం. కలెక్టర్ ఆర్డర్ అంటూ బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్త కాసిపేట మండలంలో పోయడం ఏమిటీ? కలెక్టర్ ఆర్డర్ ఉంటే గ్రామపంచాయతీ అనుమతులు అవసరం లేదా. ఇప్పటికైనా మా ఇబ్బందులు గమనించి చెత్తనే వేరే ప్రాంతాల్లో డంప్ చేయాలి.

– సిలోజు మురళి,
ప్రజాస్పందన వేదిక మండల కన్వీనర్

'నులి' నివారణ మాత్రలు వేయాలి

మంచిర్యాలటౌన్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని వైద్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో గురువారం అంగన్‌వాడీ టీచర్లు, వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. వైద్యులు శివప్రతాప్, అశోక్, స్నేహిత, లక్ష్మీప్రసన్న, రమ్యశ్రీ, సృజన్‌లు మాట్లాడుతూ.. నులిపురుగులతో పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదలలో లోపం కనిపిస్తుందన్నారు. మాత్రలు 1–19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు తగిన మోతాదులో అందించడం వల్ల నులిపురుగులను నివారించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈవో నాందేవ్, సీహెచ్‌వో దీక్షిత, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

'నులి' నివారణపై అవగాహన

దండేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులకు ఈ నెల 10న జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో చిన్నయ్య, దండేపల్లి, తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సతీష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

'విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు'

నెన్నెల: వేసవిలో విద్యుత్ సరాఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ ఎస్ఈ (జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్, ఆపరేషన్ మంచిర్యాల) గంగాధర్ అన్నారు. నెన్నెల 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. నూతనంగా 5ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బెల్లంపల్లి విద్యుత్ డీఈ రాజన్న, ఏడీఈ ఎస్పీఎం అండ్ టీఆర్ఏ శరత్, ఏడీఇ బెల్లంపల్లి రూరల్ రవికుమార్, నెన్నెల విద్యుత్ ఏఈ రాజన్న, సబ్ ఇంజనీర్ పవన్ ఉన్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

రామకృష్ణాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌లో గల 33కేవీ సబ్‌స్టేషన్లో అదనపు 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ గంగాధర్ గురువారం ప్రారంభించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ముఖ్యంగా లోవోల్టేజీ సమస్య లేకుండా చూసేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఆపరేషన్స్ కైసర్, డీఈ ఎంఆర్‌టీ రాజన్న, ఏడీ ఎంఆర్‌టీ శరత్, మంచిర్యాల రూరల్ ఏడీఈ మోహన్‌రెడ్డి, క్యాతనపల్లి ఏఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


నెన్నెల సబ్‌స్టేషన్ వద్ద ఎస్ఈ గంగాధర్

రికార్డుల స్వాధీనం పూర్తి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చగా, మంచిర్యాల మున్సిపాలిటీలో నస్పూర్ మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని పోచంపాడ్, గుడిపేట్, నర్సింగాపూర్, నంనూరు, చందనాపూర్, ముల్కల్ల, కొత్తపల్లి, వేంపల్లి గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ గత నెల 28న ఉత్తర్వులను జారీ చేశారు. ఆయా ఉత్తర్వులు వెంటనే అమల్లోకి రాగా, కార్పొరేషన్‌లో విలీనమైన నస్పూర్ మున్సిపాలిటీతో పాటు, 8 గ్రామాలకు సంబంధించిన రికార్డులను ఈ నెల 6వ తేదీలోపు మంచిర్యాల మున్సిపాలిటీకి అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గురువారం ఆయా గ్రామపంచాయతీల్లోని రశీదు పుస్తకాలు, రికార్డులు, మినట్స్ బుక్‌లతో పాటు మూడేళ్ల రికార్డులన్నింటినీ మంచిర్యాల కార్పొరేషన్ అకౌంట్స్ ఆఫీసర్ అనితకు అప్పగించారు. గతంలో ఉన్న బ్యాంక్ అకౌంట్ల స్థానంలో కొత్త బ్యాంక్ అకౌంట్ 'ది మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్' పేరిట ఓ పెన్ చేయగా, ఇకపై ఆర్థికపరమైన లావాదేవీలన్నీ ఒకే బ్యాంకు ఖాతా పేరిట నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి గతంలో మాదిరిగానే పాలన ఆయా మున్సిపాలిటీ, గ్రామపంచాయతీల నుంచే కొనసాగనుండగా, పన్నుల వసూళ్లు, ఇతరత్ర అనుమతులు కూడా మంచిర్యాల కార్పొరేషన్ నుంచే ఇవ్వనున్నారు.

డీజిల్ అక్రమ స్థావరంపై దాడి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ సల్పాల వాగు, కొండపూర్ యాప రహదారి మధ్య కొండపూర్ శ్మశానవాటిక సమీపంలో డీజిల్ అక్రమ సరఫరా స్థావరంపై జిల్లా సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడి చేశారు. జిల్లా సివిల్ సప్లై అధికారి వేణుగోపాల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లై డీటీ అంజయ్య ఆధ్వర్యంలో డీజిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసి అదుపులోకి తీసుకున్నారు. డీజిల్ ఎక్కడిది, ఎక్కడి నుంచి వచ్చింది, ఏ కంపెనీకి చెందినది అనే వివరాలు లేకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు విచారణ చేపడుతున్నారు.

గుండెపోటుతో హెచ్‌వోడీ మృతి


బాపురెడ్డి(ఫైల్)

మంచిర్యాల క్రైం: షటిల్ ఆడుతున్న క్రమంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాలకు చెందిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు బంధం బాపురెడ్డి(52) ముల్కల్ల ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ, హెచ్‌వోడీ, అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం ఉదయం షటిల్ ఆడుతుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో, అక్కడే పడిపోయాడు. గమనించిన తోటి మిత్రులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాపురెడ్డి మరణవార్త తెలుసుకున్న కళాశాల యాజమాన్యం, మిత్రులు, అధ్యాపకులు, పలు పార్టీల నాయకులు, ప్రముఖులు, విద్యార్థులు ఆస్పత్రికి వచ్చి సంతాపం తెలిపారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు పిల్లలున్నారు. ఈ విషయమై ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా.. 15నెలల క్రితం చెన్నూర్‌కు చెందిన సతీష్ అనే వ్యక్తి వద్ద రూ.20లక్షలు అప్పుగా తీసుకున్నట్లు, తర్వాత ఇద్దరి మధ్య ఆర్థిక వ్యవహారాల విషయంలో పలుమార్లు డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో తీవ్ర మనోవేదనకు లోనై బాపురెడ్డి బాధపడుతుండేవాడని, ఈ విషయంలో మనోవేదన చెందడంతోనే గుండెపోటుతో మృతి చెందాడని మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం'

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని మాలమహనాడు, మాల ఉపకులాల సంఘం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో తెలంగాణ మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కుంబాల రాజేష్, కార్యదర్శి భూపెల్లి మల్లన్న, కార్యదర్శి మాలేం చిన్నయ్య, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్: ఎస్సీ వర్గీకరణలో నేతకాని కులస్తులకు అన్యాయం జరిగిందని నేతకాని కులస్తులకు ప్రత్యేక కేటగిరి ఏర్పాటు చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబునేతకాని అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంచందర్, యువజన అధ్యక్షుడు యువరాజ్, మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు అనూష, గోపాల్, శ్రీనివాస్, లక్ష్మిరాజం, శివరాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు'

మంచిర్యాలక్రైం: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బెల్లంపెల్లి కాంట్రాక్టర్ బస్తీకి చెందిన ఆవుల సాయిబాబా, మంచిర్యాలకు చెందిన తాడిపత్రి రవీందర్‌రెడ్డి, గోధారి రవిల వద్ద స్థానిక గర్మిళ్ల శివారులోని ఓ వెంచర్‌లో రూ.31లక్ష 50వేలకు రెండు ప్లాట్లు కొనుగోలు చేశాడు. ప్లాట్‌ను రవీందర్‌రెడ్డి రిజిస్ట్రేషన్ చేయించకుండా కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురి చేశాడు. గత నెల 30న సాయిబాబా రవీందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి నిలదీయడంతో సాయబాబాను రవీందర్‌రెడ్డి కులంపేరుతో దూషించి, దాడికి యత్నించాడు. దీంతో బాధితుడు సాయిబాబా ఫిర్యాదు మేరకు రవీందర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల క్రైం: జన్నారం మండలంలోని కవ్వాల్ టైగర్ ఫారెస్ట్‌లో విధించిన ఆంక్షలను వెంటనే తొలగించాలని, స్థానిక ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

మందమర్రిరూరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కలిగి ఉండాలని మంచిర్యాల జిల్లా జడ్జి మారంరెడ్డి అర్పిత అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గురువారం నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

భారత క్రీడారత్న అవార్డు గ్రహీతకు సన్మానం

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన కరాటే క్రీడాకారుడు పఠాన్ జమీల్‌ఖాన్‌కు ఇటీవల ప్రభుత్వం భారత క్రీడారత్న అవార్డు ప్రకటించింది. గురువారం జమీల్‌ఖాన్ మందమర్రికి సందర్భంగా స్థానికులు ఆయనను ఘనంగా సన్మానించారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

దండేపల్లి: సత్యసాయి ట్రస్ట్ లక్సెట్టిపేట ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని లింగాపూర్ ఆదర్శపాఠశాల పదోతరగతి విద్యార్థి సాయిచరణ్ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. విద్యార్థిని ఎంఈవో చిన్నయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

అవగాహన సదస్సు

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ, చెన్నూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం 'బేటీబచావో–బేటీ పడావో'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడ పిల్లల ప్రాముఖ్యత, మహిళా సాధికారత అంశాలపై అవగాహన కల్పించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

బెల్లంపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దిన్ అన్నారు. బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానం ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త షానక్వీ, మాజీ కౌన్సిలర్ గుజ్జ రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు అభిషేకం

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి జీపీ పరిధిలోని దుబ్బపల్లిలో నెలకొల్పే సత్యనారాయణ స్వామి విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక జలాభిషేకం చేశారు. శుక్రవారం ఉదయం 11–31గంటలకు నూతనంగా నిర్మించిన ఆలయంలో సత్యనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉంటుందని అర్చకులు తెలిపారు.

'ఉపాధి' పనులు పరిశీలన


అజోల్లా పెంపకాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

చెన్నూర్‌రూరల్: మండలంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ పరిశీలించారు. లంబడిపల్లిలో చేపట్టిన రీచార్జ్ బోరు, అజోల్లా పెంపకాన్ని సందర్శించారు. కాచన్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ, నర్సరీలను చూశారు. ఆస్నాద, పొన్నారం గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. రైతులకు ఉపాధిహామీ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రీచార్జ్ బోరు, అజోల్లా గడ్డి పెంపకంపై తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఈసీ చంద్రశేఖర్, టీఏలు రవీందర్, వెంకటేశ్, రవి ఉన్నారు.

'ఈజీఎస్ ద్వారా పశువుల పాకల నిర్మాణాలు'

భీమారం: రైతులకు మేలు చేసేలా 'ఉపాధి' నిధుల ద్వారా పశువుల పాకలు నిర్మిస్తున్నామని డీఆర్డీవో కిషన్ తెలిపారు. మండలంలో గురువారం పర్యటించి ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలకు పనులు కల్పించడమే కాకుండా, గ్రామాల్లో రైతుల అవసరాలతో పాటు రోడ్లు, పాఠశాలల ప్రహరీలను కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పశువులు సేద తీరేందుకు పాకల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. భీమారం, పోలంపల్లిలో పశువుల పాక పనులతో పాటు ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో సతీష్ రెడ్డి, ఈజీఎస్ ఏపీవో జీనత్, ఈసీ శ్రీనివాస్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నక్క రాజన్న పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై అవగాహన

మంచిర్యాలటౌన్: వివిధ విభాగాల్లో ఇంజనీరింగ్ సర్వీసుల్లో రిక్రూట్ అయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో ప్రజలకు అందిస్తున్న సేవలు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై అవగాహన పెంచుకునేందుకు అవకాశం కల్పించగా, గురువారం 25మందికి మంచిర్యాల కార్పొరేషన్‌లో అధికారులు పరస్పర చర్చతో అవగాహన కల్పించారు. కార్పొరేషన్ ద్వారా ప్రతిరోజు చెత్త సేకరణ, డంపింగ్ యార్డు నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, ఆసుపత్రుల నిర్వహణ, జంతువధశాలల నిర్వహణను స్వయంగా పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో అందిస్తున్న ప్రాథమిక సౌకర్యాలు, వ్యర్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం, పాఠశాలల నిర్వహణలపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మసూద్ అలీ, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సంపత్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, ఏఈలు రాజేందర్, తబస్సుం పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
చెన్నూర్: సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899